విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 15 అక్టోబరు 2025 8 పేజీలు

కన్నీటి కడలి

- రామాపురం బీచ్‌లో మృత్యు కెరటాలు
- తరుచుగా ప్రమాదాలు
- బీచ్‌లో పర్యాటకుల భద్రత ప్రశ్నార్థకం
- దృష్టిసారించకుంటే పర్యాటక రంగానికి పెనుప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో – బాపట్ల : కడలిలో కెరటాలు విహార యాత్రలకు వచ్చే పర్యాటకులు విషాదయాత్రలుగా మిగిలి కన్నీరు పెడుతున్నారు. సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చిన ప్రజలకు దు:ఖసాగరంలో మునిగిపోతున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేస్తూ శోకాన్ని మిగిలుస్తున్నారు. అధికారుల హెచ్చరికలు ఎన్ని ఉన్నా పర్యాటకులు పెడచెవిన పెడుతుండటంతో ప్రమదాల భారీన పడి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. బాపట్ల జిల్లాలో సుధూర తీరప్రాంతం ఉన్న జిల్లాగా పేరుంది. రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో తీర ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంది. మరో వైపు బాపట్లలో సూర్యలంక చీరాలలో వాడరేవు రామాపురం బీచ్‌లు అత్యంత ప్రజాదారణ కలిగి పర్యాటకులను ఎక్కువగా ఆకర్షించే ప్రాంతాలు. అయితే ఇటీవల కాలంలో రామాపురం బీచ్‌లో మృతి కెరటాలు కలవరపెడుతున్నాయి. సరదాగా గడింపేందుక స్నేహితులతో బీచ్‌కు వచ్చే యువతను కడలిలోని అలలు మింగేస్తున్నాయి. తరచుగా బీచ్‌లో గల్లంతు ఘటలను అధికార వర్గాలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. బీచ్‌కు వచ్చి పదుల సంఖ్యలో ప్రమాదాల భారీన పడుతూ మృత్యు ఒడికి చేరుతున్నారు. తాజాగా మూడు రోజుల క్రితం ఆదివారం రామాపురం బీచ్‌లో ఐదుగురు గల్లంతైన ఘటన జిల్లా ప్రజలను కలిచివేసింది. అదేరోజు ముగ్గురు మృతదేహాలు దొరకగా తరువాత రోజు ఒకటీ మంగళవారం మరోకటి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు సమీపంలోని తీరం వద్ద బయటపడింది.

– బాపట్ల సూర్యలంక బీచ్ సమాంతరంగా ఉండటంతో పాటు ఒక నిర్ధిష్ట ప్రాంతంలోనే మునిగేందుకు అవకాశం మిగతా 2 లో ...

16న మోదీ పర్యటన

- విజయవంతం చేయాలి - ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 16వ తేదీన కర్నూల్‌లో నిర్వహించే ప్రధాని మోదీ పర్యటనకు డోన్ నియోజక వర్గం నుండి 10వేలకు మందికి పైగా హాజరై జయప్రదం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఈ నెల 16 వ తేదీన కర్నూల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సందర్భంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ని డోన్ నియోజకవర్గ కోర్డినేటర్ గా నియమించడం జరిగినది.ఈ సందర్భంగా మంగళవారం డోన్ శాసనసభ్యులు కోట్ల జైసూర్య ప్రకాష్ రెడ్డి కార్యాలయం నందు వారి అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశం ఉద్దేశించి ఒంగోలు శాసనసభ్యులు జనార్దన్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి అందరూ తరిలిరావాలని,గ్రామాలకు బస్సు లు, భోజన ఏర్పాట్లు చేయడం జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గం నుండి 10వేల మందికి తగ్గకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త మరియు నాయకులు బాధ్యతగా తీసుకోని ఈ సభను విజయవంతం చేయాలి అన్ని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశీలుకులు హరి, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో వైసీపీ ప్రమేయం అసత్యం

- ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్థన్‌రావుపై లైడిటెక్టర్ వినియోగించాలి
- కేసును సీబీఐకి అప్పగించాలి
- వైసీపీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : నకిలీ మద్యం కేసులో వైయస్సార్‌సీపీ ప్రమేయం అసత్యమని వైసీపీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ వైయస్సార్‌సీపీ డిమాండ్ చేస్తున్నట్లు నకిలీ మద్యం కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కేసులో ప్రమేయం ఉందని, మీరు పేరు చెప్పించిన వైయస్సార్‌సీపీ నాయకుడు జోగి రమేష్ చేసిన సవాల్.. సత్యశోధన పరీక్ష (లైడిటెక్టర్ టెస్ట్)కు మీరు సిద్ధంగా ఉన్నారా అని సవాలు విసిరారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇప్పటికీ రాష్ట్రంలోని అన్ని వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టు షాప్‌ల్లో తనిఖీలు ఎందుకు చేయడం లేదు? ఏది అసలు మద్యం? ఏది నకిలీ అనేది గుర్తించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదన్నారు. కుటీర పరిశ్రమలా మిగతా 2 లో ...

అడవులను సంరక్షిస్తూ పర్యాటక అభివృద్ధిపైన దృష్టి సారించాలి

కలెక్టర్ రాజాబాబు

విశాలాంధ్ర-ఒంగోలు : అడవుల సంరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధి పైనా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని జిల్లా యంత్రాంగం తరఫు నుంచి అందిస్తామన్నారు. వివిధ విభాగాల అటవీ శాఖ అధికారులతో మంగళవారం ఆయన ప్రకాశం భవన్లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం, నగరవనాల అభివృద్ధి, రోడ్లు, మొబైల్ టవర్ల నిర్మాణాలు వంటి భారీ ప్రాజెక్టులకు అటవీశాఖ అనుమతులు, కోస్తా తీరం వెంట గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ అభివృద్ధి, రెవెన్యూ రికార్డులలో రిజర్వ్ ఫారెస్ట్ భూముల వివరాలు అప్ డేషన్/మ్యూటేషన్ , ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్, అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, పర్యాటక అభివృద్ధి, స్థానికులకు జీవనోపాధి కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులు కలెక్టరుకు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అటవీ శాఖల వివిధ విభాగాల నుంచి ఒకరిని ప్రత్యేకంగా కేటాయించాలని చెప్పారు. హైదరాబాద్, అమరావతి, తిరుపతి, బెంగళూరులకు మధ్యలో ఉన్న ప్రాంతం కావటం, నల్లమల పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉండడం వలన భవిష్యత్తులో మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్, డీ.ఎఫ్.వో. (సోషల్ ఫారెస్ట్) రాజశేఖర్ రావు, గిద్దలూరు టైగర్ రిజర్వ్ డీ.డీ. నిషా కుమారి, మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ అబ్దుల్ రవుఫ్ పాల్గొన్నారు.

గనుల శాఖ రాబడిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి : కలెక్టర్ 2 లో..

16న శ్రీశైలం రానున్న ప్రధాని మోదీ

దోర్నాల పోలీసుల వారి సూచనలు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఈ నెల 16న భారత ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటన నేపథ్యంలో శ్రీశైలం వెళ్ళు భక్తులకు దోర్నాల పోలీసు వారు పలు సూచనలు చేశారు. మంగళవారం మార్కాపురం డీఎస్పీ నాగరాజు దోర్నాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి వస్తుండడంతో 16న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు దోర్నాలలోని శ్రీశైలం రహదారిలో గల మల్లికార్జున్ నగర్ వద్ద శ్రీశైలం వైపు వెళ్ళే వాహనాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే కర్నూలు రహదారి వైపు వెళ్ళు భారీ వాహనాలను, పెద్దారవీడు మండలం కుంట జంక్షన్ వద్ద నుండి గిద్దలూరు వైపు మళ్ళించడం జరుగుతుందన్నారు. ఘాట్ రోడ్డులో ప్రయాణించు వాహనాలకు ఫిట్నెస్, డ్రైవర్‌లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లేని వాహనాలను తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. శ్రీశైలం వెళ్ళు వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అటువంటి వాహనాలను తనిఖీ చేసి దోర్నాలలోనే నిలిపివేస్తామన్నారు. కావున భక్తులు, వాహనదారులు అటవీ శాఖ మరియు పోలీస్ శాఖా వారి హెచ్చరికల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకర్ రావు,. దోర్నాల ఎస్ఐ వి మహేష్ లు. పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగం ద్వారా దేశ ఆర్థిక పురోభివృద్ధి

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు

విశాలాంధ్ర -ఒంగోలు : దేశంలోని ప్రజలందరూ స్వదేశీ వస్తువుల వినియోగం ద్వారా దేశ ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చునని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో బిజెపి జిల్లా నిర్భర్ భారత్ కార్యశాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోము వీర్రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ, బాలగంగాధర్ తిలక్ వంటి వారు స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రజలను ఎంతో ప్రోత్సహించారన్నారు. ప్రపంచవ్యాప్తంగా 5 ట్రిలియన్ డాలర్ల ఆదాయమే లక్ష్యంగా ప్రధాని మోడీ పనిచేస్తున్నారన్నారు. గతంలో దిగుమతి చేసు కుంటున్నా వస్తువులను దేశంలోనే తయారు చేసుకునేలా, పెట్రోలుకు ప్రత్యామ్నాయ వినియోగాలపై అవగాహన కలిగించేలా ఈపాటికే చర్యలు ప్రారంభమయ్యాయి అన్నారు. ఆపరేషన్ సింధూర్ లో మనం వాడిన స్వదేశీ టెక్నాలజీని చూసి ప్రపంచమంతా చర్చించుకుంటుందన్నారు. జోనల్ ఇంచార్జ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబర్ 20 నుండి ప్రారంభమై 90 రోజులు వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గెమ్ శ్రీనివాసరావు, మాజీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ నిదమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, ఒంగోలు నియోజక వర్గం ఇంచార్జ్ యోగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయిపై దాడి

భారత రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం

విశాలాంధ్ర-మద్దిపాడు : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై ఒక మతోన్మాది బూటు విసరడం అనేది అత్యంత అమానుషమైన చర్యగా, అది భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఆ దారుణానికి పాల్పడిన దోషిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయి పై దాడికి నిరసనగా మంగళవారం ఎవరైనా వెంకటరాజుపాలెం, మద్దిపాడు అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

గనుల శాఖ రాబడిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

కలెక్టర్ రాజాబాబు

విశాలాంధ్ర-ఒంగోలు : గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాబడిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని తన చాంబరులో గనుల శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లాలోని గనుల విస్తీర్ణము, వాటి రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయము, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, తదితర వివరాలు పై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 432.94 కోట్ల రూపాయల రాబడి లక్ష్యంగా నిర్దేశించగా, సెప్టెంబర్, 2025 మాసాంతానికి 157.08 కోట్ల రూపాయలు రావడం జరిగిందని, అల్లాగే జిల్లాలో మేజర్, మైనర్ మైనింగ్ క్వారీలు వుండగా, అందులో 144 క్వారీ లు పనిచేస్తుండగా, 132 క్వారీలు పనిచేయడం లేదని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలుపుతూ, సంబంధిత వివరాలను సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన రాబడి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మైనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా లో ఎక్కడా అక్రమ మైనింగ్ జరగరాదని స్పష్టం చేసారు. జిల్లాలో ఏ కారణం చేత మైనింగ్ క్వారీ పనిచేయడం లేదన్న విషయాన్ని సమగ్ర నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్, గనుల శాఖ డిడిని ఆదేశించారు. ఈ సమావేశంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు కర్నూల్ రోడ్‌లో కూలిన భారీ వృక్షం

- కిలోమీటర్ల కొద్దీ నిలిచిన వాహనాలు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

విశాలాంధ్ర-ఒంగోలు : భారీ వృక్షం కూలటంతో ఒంగోలులో గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఒంగోలులోని కర్నూల్ రోడ్డులో నవభారత్ బిల్డింగ్స్ ఎదురుగా ఉన్న భారీ వృక్షం మంగళవారం నేలకొరిగింది. దీంతో దాదాపు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. మార్కాపురం, శ్రీశైలం, కర్నూల్, గిద్దలూరు వంటి ప్రాంతాలకు వెళ్లవలసిన వాహనాలు, బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు, పోలీసులు, స్థానిక ప్రజల సహకారంతో జెసిపి తో వృక్షాన్ని తొలగించారు. ఎటువంటి గాలి వాన లేకున్నా, భారీ వృక్షం పడిపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది.

తిరుమలలో ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి మంగళవారం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం ఎంపి మాగుంట జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా ఎంపి శ్రీవారిని దర్శించుకున్నారు.

స్మార్ట్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-మద్దిపాడు : మండలంలోని కీర్తిపాడులో స్మార్ట్ కార్డులు పంపిణీ మంగళవారం చేశారు. ఈ సందర్భంగా రావి నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ కార్డులు పంపిణీ ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం పేదలకు రెండు రూపాయలకు బియ్యం కందిపప్పు పంచదార ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి బుజ్జి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రమేయం అసత్యం

(మొదటిపేజీ తరువాయి)

నకిలీ మద్యం తయారు చేస్తూ, ఆధారాలతో సహా బయటపడినప్పటి నుంచి, దాన్ని ఎలాగైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటించేందుకు టీడీపీ పెద్దలు చేస్తున్న కుట్రలు పరాకాష్టకు చేరాయన్నారు. వైయస్సార్‌సీపీ నాయకుడు జోగి రమేష్ చెబితేనే, తాను నకిలీ మద్యం తయారు చేశానంటూ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జనార్ధన్‌రావు ఒక వీడియో లీక్ చేసినప్పటి నుండి ఎల్లో మీడియా రెచ్చిపోతుందన్నారు. కేసు నుంచి తాము బయట పడడమే కాకుండా, డైవర్షన్ కోసం సీఎం చంద్రబాబు చేసిన కుట్ర ఇది అన్నది స్పష్టమవుతోందన్నారు. అసలు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు వీడియో ఎలా రికార్డ్ చేశాడు? పైగా తన ఫోన్ పోయిందని చెప్పినట్లు ఎల్లో మీడియాలోనే వచ్చిందో చెప్పాలన్నారు. ఏ కేసులో నిందితుడైనా, ఇన్వెస్టిగేటివ్ అధికారుల ముందు ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు నిలబడి, చేతులు కట్టుకుని వినమ్రతతో మాట్లాడతాడు. కానీ నిన్న జనార్ధన్‌రావు లీక్ చేసిన వీడియోలో ఆయన చక్కగా చైర్‌లో కూర్చుని ఉన్నాడు. పక్క నుంచి ఆఫీసర్ ఎవరో ప్రాంప్ట్ చేస్తున్నాడు. పైగా తను ఆఫ్రికా నుంచి వచ్చినప్పటి డ్రెస్‌తోనే ఉన్నాడు. మరి ఆ వీడియో ఎప్పుడు, ఎవరు, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారు? ఇదంతా చూస్తుంటే, ఒక పథకం ప్రకారం చేసిన కుట్ర మాదిరిగా కనిపించడం లేదా అన్నారు. అలాగే ఆ వీడియోను మీడియాకు ఎవరు విడుదల చేశారు? అంటే.. ఈ కేసులో వాస్తవాలను కప్పిపుచ్చుతూ కొత్త కట్టుకథ వినిపించేందుకే ఆ వీడియో విడుదల చేశారన్నది స్పష్టమవుతోంది కదా? పోలీసుల అదుపులో, జైలు అధికారుల రిమాండ్‌లో ఉన్న వ్యక్తి వీడియో లీకు కావడానికి బాధ్యత ఎవరిదన్నారు. ఇదే జనార్ధన్‌రావు గత వారం ఆఫ్రికా నుంచి కూడా ఒక వీడియో రిలీజ్ చేశారు. నకిలీ మద్యం తయారీలో పార్టీ, ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదని, తాము మాత్రమే ఆ పని చేశామని చెప్పారు. మరి నిజంగా జోగి రమేష్ చెబితేనే తాను నకిలీ మద్యం తయారుచేసి ఉంటే, అదే విషయాన్ని ఆ వీడియోలోనే ఎందుకు చెప్పలేదన్నారు. ఇప్పటికైన వైసీపీ నేతలను నకిలీ మద్యం కుంభకోణం లో ఇరికించే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.

కన్నీటి కడలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నందు వలన ఇక్కడ ప్రమాదాలు చాలా తక్కువగా జరుగుతుంటాయి. మరోవైపు మెరైన్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు, గజ ఈతగాళ్లు నిత్యం పర్యవేక్షిస్తూ సముద్రంలో లోతుకు వెళ్లే వారిని హెచ్చరిస్తూ ఉంటారు. దీంతో సూర్యలంక బీచ్‌లో గల్లంతైన రక్షించేందుకు సిబ్బంది ఉన్నారు. కానీ చీరాల నియోజకవర్గంలో వాడరేవు నుంచి రామాపురం వరకు బీచ్ ఉండటంతో పర్యాటకులు వారి ఇష్టం వచ్చిన ప్రదేశాల్లో మునుగుతూ ఉంటారు. మునిగేందుకు నిర్దిష్ట ప్రదేశాలు లేకపోవటంతో వారికి ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో మునగటం వలన ప్రమాదాల భారీన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చెట్లు దట్టంగా ఉండటంతో మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లి మృతి చెందుతున్న పరిస్థితులు చాలా ఉన్నాయి.

- ఇలా చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం

చీరాల నియోజకవర్గంలో సుమారు 7 కిలో మీటర్ల పొడవున సముద్ర తీరం ఉంది. తీరం పొడవున జనం మద్యం సేవిస్తూ మునుగుతున్న పరిస్థితులు ఉన్నాయి. తీరం పొడవున పోలీసులను నియమించటం అసాధ్యం. బాపట్ల సూర్యలంక బీచ్‌లో మునిగేందుకు ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని నిర్ణయించినట్లు చీరాల నియోజకవర్గంలో కూడా నిర్ణయిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. మరో వైపు వాడరేవు, రామాపురం బీచ్‌లో రాత్రివేళల్లో తీరం అంచున మద్యం తాగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది. పర్యాటక రంగాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా స్థానిక అధికార యంత్రాంగం తీరంలో మృత్యు రోధనలు వినపడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

రైతులకు యూరియా బస్తాలు పంపిణీ

ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని నుచ్చుపోత గ్రామ పంచాయతీ పరిధి లోనీ సచివాలయంలో మంగళవారం రైతులకు యూరియా బస్తాలు పంపిణీ కార్యక్రమంలో కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమా శ్రీనివాసులు పాల్గొన్న, ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు గోళ్ళ సూర్య ప్రకాష్, పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, నుచ్చుపోత గ్రామ టిడిపి ఉపాధ్యక్షుడు మండ్ల మల్లికార్జున, పామూరు యూనిట్ ఇంఛార్జీ ఇర్రి శ్రీనివాసులు, వంకదారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'మెడిక్యూర్'లో గుండెకు అరుదైన శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-ఒంగోలు : గుండెలో కాల్షియం పేరుకుపోయి స్టంట్ వేయలేని స్థితిలో ఉన్న వ్యక్తికి అత్యాధునిక పరికరం ద్వారా శస్త్ర చికిత్స ను విజయవంతంగా నిర్వహించినట్లు మెడిక్యూర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. హాస్పిటల్ ఆవరణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన 83 సంవత్సరాల వయసు గల శేషగిరిరావు గుండెజబ్బుతో మెడికూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ని సంప్రదించారని అన్నారు. వైద్య పరీక్షల అనంతరం హైదరాబాద్ గాని, విజయవాడ గాని తీసుకు వెళ్లాలని వారి కుటుంబ సభ్యులకు తెలియజేసినప్పటికీ వారి కుటుంబ సభ్యులు ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రిల్లింగ్ మిషన్ లాంటి యంత్రం ద్వారా కాల్షియంని కట్ చేసుకుంటూ స్టంట్ ను వేసి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. ఇది జిల్లాలోనే మొట్టమొదటి అరుదైన చికిత్స అని అన్నారు. 83 సంవత్సరాల వయసులో గుండె ఆపరేషన్ కూడా చేయటానికి వీలుపడని కారణంగా ఈ అత్యాధునిక పరికరం ద్వారా సాధ్యమైందని పేషంటు తమపై నమ్మకం ఉంచి ఈ చికిత్సను అందించుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. రోగి కుటుంబ సభ్యులు సుబ్బారావు మాట్లాడుతూ ఎంత కష్ట పరిస్థితుల్లోనైనా ఇక్కడే వైద్యం అందించాలని కోరామని డాక్టర్ శ్రీధర్ బాబు రిస్క్ తో కూడుకున్నటువంటి చికిత్సను చికిత్సను అందించి మా నాన్న ప్రాణాలు కాపాడారని వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మెడికూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మేనేజర్ దాసరి సుధాకర్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

రెడ్డి సాగర్ వద్ద ఓబిసి కెనాల్‌లో ఘటన

విశాలాంధ్ర - తాళ్లూరు : మండలంలోని రెడ్డి సాగర్ వద్ద ఓబీసీ కెనాల్ చేపల వేట చేస్తున్న వ్యక్తి గల్లంతయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పొదిలి మండలం కాటూరి వారి పాలెం కు చెందిన వ్యక్తి మెలిక ప్రసాదు (43) సంవత్సరాలు అను వ్యక్తి గత రెండు రోజుల నుండి రెడ్డి సాగర్ వద్ద సాగర్ కెనాల్ లో చేపల వేట సాగిస్తున్నాడు. అయితే మంగళవారం చేపలు పడిన వలను తీయటానికి ప్రయత్నిస్తున్న సమయంలో వల్ల కాళ్లకు చుట్టుకొని కనిపించకుండా పోయాడు. దీంతో గమనించిన కొండమ్మ సమీపంలో వేట సాగిస్తున్న విజయ్ కుమార్ కు తెలపడంతో ఆయన చుట్టుపక్కల రైతు లు కలిసి ఎంత వెతికినా కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ప్రసాద్‌కు భార్య సుజాత ఇరువురి కుమారులు, కుమార్తె ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర-టంగుటూరు : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డిస్టిక్ ఎయిడ్స్‌ప్రివెన్షన్స్ కంట్రోల్ యూనిట్ సహకారంతో మదర్ ల్యాండ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వారు హెచ్ఐవి ఎయిడ్స్ సమాచారం గురించి అవగాహన కలిగించే మొబైల్ ఎల్ఈడి వన్ టంగుటూరు మండలంలోని అరుంధతి నగర్ మరియు బస్టాండ్ నందు తదితర ప్రాంతాలలో తిరుగుతూ ప్రజలందరికీ మంగళవారం అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండలం ఔట్రీచ్ నాగ కోమలి అలాగే మస్తానమ్మ మరియు ఎం ప్రభావ ఏ.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ హర్షిణీ'లో సైబర్ క్రైమ్‌పై అవగాహన

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక శ్రీ హర్షిణీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాలలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ సెక్యూరిటీ డేటాబేస్ నుండి వచ్చిన చీఫ్ కౌన్సిలర్లు ప్రదీప్ కోతపల్లి, తిరుమలశెట్టి హేమంత్ హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలు మరియు ఆన్లైన్ భద్రతపై విస్తృతమైన అవగాహన కల్పించారు. హాకింగ్, ఫిషింగ్, సోషల్ మీడియా మోసాలు, మరియు మొబైల్ యాప్ల ద్వారా జరుగుతున్న మోసపూరిత చర్యల గురించి వివరించి, విద్యార్థులు ఎలా జాగ్రత్తగా ఉండాలో, తమ పర్సనల్ డేటా, పాస్వర్డ్, మరియు ఆన్లైన్ ఐడెంటిటీని ఎలా రక్షించుకోవాలో వివరిస్తూ చైతన్యాన్ని కల్పించారు. విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవి కుమార్ మాట్లాడుతూ "డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక జ్ఞానంతో పాటు బాధ్యతను పెంపొందిస్తాయి. హాకింగ్, ఫేక్ లింక్స్ వంటి మోసాలకు బలి కాకుండా జాగ్రత్తగా ఉండడం అత్యంత ముఖ్యం" అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధీర్ చక్రవర్తి మాట్లాడుతూ "సైబర్ క్రైమ్ అవగాహన కలిగించడం కాలానికి తగిన అవసరం. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా డిజిటల్ సురక్షిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలి" అన్నారు.

ప్రమాదం పొంచి ఉన్న కొండేపి రోడ్డు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని టంగుటూరు నుండి కొండేపి రోడ్డు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు నాన అవస్థలు పడుతున్నారు. టంగుటూరు నుండి కొండేపి వెళ్లేందుకు అదేవిధంగా టంగుటూరు బస్టాండ్ నుండి పొగాకు బోర్డు అదేవిధంగా గవర్నమెంట్ హాస్పిటల్ తాసిల్దార్ కార్యాలయం ఎంఈఓ ఆఫీస్ ఉపాధి ఆఫీసు మండల పరిషత్ కార్యాలయం ఈ రోడ్డు మార్గాన వెళ్ళాలి. కానీ రోడ్డు పరిస్థితి చూస్తే ఎక్కడకక్కడ గోతులు ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఎంతోమంది పడి చేతులు కాళ్లు ఇరగ్గొట్టుకున్న పరిస్థితులు కూడా గతంలో జరిగాయి. అప్పటికన్నా ఇంకా అధ్వాన్నంగా తయారైంది. వాహనదారులు వెళ్లాలంటేనే వణికి పోతున్నారు. కనుక పై అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మంగళవారం నాడు బోర్డుకొచ్చే ట్రక్టర్ ఇరక్కపోయి నాన అవస్థల పద్దారు. కనుక పై అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేసి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

విశాలాంధ్ర-ఒంగోలు : నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం ఒంగోలులో నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రత్నదీప్, ఉషోదయ సూపర్ మార్కెట్లలో వినియోగదారులతో మాట్లాడి తగ్గిన ధరలపై వాని అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. పేద, మధ్య తరగతి వారి మేలు కోరేది బీజేపీ ప్రభుత్వం మాత్రమే అని గుర్తు చేశారు. జీఎస్టీ స్లాబ్ లలో మార్పులు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

నేడు వైసీపీ కోటి సంతకాల సేకరణ

వైసీపీ మండల అధ్యక్షుడు శంకర్ రెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నకిలీ మద్యాన్ని నియంత్రిం చాలని కోరుతూ వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నేడు మండల కేంద్రమైన కొనకనమిట్ల బస్టాండ్ సమీపంలో వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ అధ్యక్షులు మోర శంకర్ రెడ్డి తెలిపారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైసిపి ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఒంగోల్ పార్లమెంటరీ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి కోటి సంతకాల కార్యక్రమానికి హాజరవుతారన్నారు మండలం లోని వైసిపి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలనీ కోరారు. మంగళవారం ఏర్పాట్లను ఎంపీపీ మురళీకృష్ణ, జడ్పిటిసి సభ్యుడు అక్కి దాసరి ఏడుకొండలు, వైసీపీ నాయకులు మంగాపురం సర్పంచి ప్రకాష్ రెడ్డి, మెట్టు రామిరెడ్డి ఉన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య

విశాలాంధ్ర-టంగుటూరు : అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని, కౌలుచట్టాన్ని మార్చి వాస్తవ కౌలు దారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం టంగుటూరు మండల డిప్యూటీ తహ సీల్దార్‌కు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. అసెంబ్లీలో కూడా వ్యవసాయ శాఖ మంత్రి కొత్త చట్టం తీసుకొస్తున్నామని చెప్పారు. కానీ 16 నెలలు గడుస్తున్న కౌలు రైతులకు భూ యజమాని సంతకం లేకుండా గుర్తింపు కార్డు వచ్చే పరిస్థితి లేదు, కార్డు లేకపోతే ప్రభుత్వం నుంచి సబ్సిడీలు రావు, బ్యాంకు రుణాలురావు, పంట అమ్ముకునే పరిస్థితి ఉండదు అందువల్ల చట్టం మార్చి వాస్తవ కవులు దారులకి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కౌలు రైతు సంఘం మండల కన్వీనర్ షేక్ మీరాస్, వ్యవసాయ కార్మిక సంఘం టంగుటూరు ఏరియా కార్యదర్శి వి.మోజెస్, వెంకటరెడ్డి, జీ. సాల్మన్, ఎమ్. యానాది, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూసార పరీక్షా ఫలితాల పత్రాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని వల్లూరు, కాకుటూరివారిపాలెం, యం.నిడమానూరు గ్రామాల నందు జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారి ఆధ్వర్యంలో భూసార పరీక్షా ఫలితాల పత్రాల ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. స్థానిక మండల వ్యవసాయ అధికారి యుగంధర్ రెడ్డి అధ్యక్షత వహించగా ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ అధికారి శైలజ పాల్గొని భూసార పరీక్షా ఫలితాల ఉపయోగాల గురించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించవచ్చు అని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల కార్డు నందు సమాచారం చక్కగా తెలుగులో రైతులకు అర్థమయ్యేలా ఏయే పోషక లోపాలు ఉన్నది అలాగే తరువాత సాగు చేయబోయే పంటలకు అవసరమైన పోషకాలు తగిన మోతాదులో ఉన్నాయా లేవా అనే పూర్తి వివరాలు పొందుపరచబడి ఉండునని రైతు సోదరులు ఈ విషయాలను గమనించాలని తెలిపారు. అలాగే నీటి పరీక్షలు చేయించుకోవడం వలన కలిగే లాభాలను కూడా వివరించారు. కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణా ధికారులు రామకృష్ణా రెడ్డి, వెంకటేశ్వర్లు గ్రామ సహాయకులు ప్రభాకర్, అజయ్, మెహరున్నీసా, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అత్యధికంగా రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అత్యధికంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది.వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కలెక్టర్ చెప్పారు.పంటల సాగు సమయంలో రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి రూ.15,820 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న విషయాలను ఆయన ప్రస్తావించారు. వ్యవసాయ రంగానికి రూ.12,080 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం రూ.3,472 కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అర్ధ సంవత్సరం గడిచినప్పటికీ కేవలం 28.74శాతం పురోగతి సాధించడం ఏమిటని ఆరా తీశారు.వార్షిక ప్రణాళికను బ్యాంకర్లు విస్మరించరాదన్నారు. రైతులకు సేవలందించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. అభివృద్ధిలో బ్యాంకర్లు సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. అన్నింటిలో బాపట్ల జిల్లా మూడో స్థానంలో నిలిచేలా సహకరించాలన్నారు.కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదని కలెక్టర్ తెలిపారు. ఎనిమిది వేల మంది కౌలు రైతులకు రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, కేవలం 2,326 మంది కౌలు రైతులకు రూ.8.80 కోట్లు రుణం ఇవ్వటమేమిటని ఆరా తీశారు.పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు పెట్టుబడులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పట్టించుకోవడంలేదని బ్యాంక్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.బ్యాంకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని పలు సూచనలు చేశారు.ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.కలెక్టరేట్లో 15 రోజుల్లో ఏటీఎం ఏర్పాటు చేయాలన్నారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణానివ్వాలని కలెక్టర్ కోరారు.ఆర్థిక సంవత్సరంలో రూ.1,291 కోట్ల రుణాలతో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం 37.15 శాతం మాత్రమే పురోగతి సాధించడం ఏమిటన్నారు. కేవలం రూ.479.75 కోట్లు రుణం ఇస్తే లక్ష్యాలు ఎప్పుడు చేరుకుంటారో బ్యాంకు అధికారులు పరిశీలించాలన్నారు.మిగిలిన రంగాలలో లక్ష్యం మేరకు రుణాలు పురోగతి సాధించాలన్నారు. ప్రాధాన్యత రంగాలకే విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయాలని సూచించారు. కమిటీ డిప్యూటీ కన్వీనర్ సోమేశ్వరరావు, ఎల్.డి.ఎం శివకృష్ణ,ఆర్బిఐ ఎల్డిఓ గిరిధర్,అన్ని బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉదయ్ కిరణ్ బ్రిక్స్ ఎంపీడీవో సుజాత సందర్శించి జీఎస్టీ పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలకు ఇంటి నిర్మాణ ఖర్చులు తగ్గుతున్నాయని సొంత ఇంటి కల నెరవేరుతుందని తెలిపారు. జీఎస్టీ తగ్గటం వలన సిమెంట్ బ్రిక్స్, టింబర్ ఇతర మెటీరియల్‌పై మరింత డబ్బు ఆదాయం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ టిడిపి అధ్యక్షుడు మండవ ప్రసాద్, మండల టిడిపి నాయకుడు పల్లపోతు రమేష్ బాబు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, ఏఈ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీకాంత్, హౌసింగ్ సూపర్వైజర్ సుధీర్, పంచాయతీ కార్యదర్శి నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

24 మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో జరిగిన రెండు వేరువేరు ఘర్షణ ఘటనలపై పోలీసులు 24 మందిపై సోమవారం కేసులో నమోదు చేశారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు పాత గొడవలు, టేప్ రికార్డు సౌండ్ అధికంగా పెట్టారన్న నేపథ్యంలో గోపాలపల్లి గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 16 మందిపై కేసులు నమోదు చేశారు. కొమరోలు మండలం అక్కపల్లి గ్రామంలో స్థలం వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసులో నమోదు చేశామని ఎస్సై తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగరాజు హెచ్చరించారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

విశాలాంధ్ర-కంభం : జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు గోడపత్రికను మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ ఆవిష్కరించారు. అనంతరం అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, నారపరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలోని 8, 9, 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు అందరూ ఈనెల 18వ తేదీన జరిగే పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొనే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. నవంబర్ 1 వ తేదీన మండల స్థాయి, 23న జిల్లాస్థాయి, డిసెంబర్ 12 ,13 మరియు 14 తేదీలలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జరుగుతాయనీ, ఈ చెకుముకి సైన్స్ సంబరాలను అందరూ జయప్రదం చేయాలని కోరారు. చెకుముకి కన్వీనర్ షేక్ నాయబ్ రసూల్, కోశాధికారి మస్తాన్, ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, యూత్ కన్వీనర్ జావిద్, మరియు పాఠశాల సిబ్బంది నూర్జహాన్ బేగం,శరబమ్మ, విజయలక్ష్మి, సత్య రామారావు, సుబ్రహ్మణ్యం, సలీం భాష, రమణారెడ్డి, శ్రీకృష్ణ, రంగనాయకులు, విజయకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజును కలిసిన ఉమ్మడిశెట్టి శ్రీను

విశాలాంధ్ర-పామూరు రూరల్ : ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో మంగళవారం ఆత్మ నిర్భర్ భారత్ ప్రకాశం జిల్లా కార్యశాలకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సోము వీర్రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పామూరు బిజెపి మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను. అనంతరం సోము వీర్రాజు కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పామూరు, కనిగిరి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

దాతలు చేయూత అభినందనీయం

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వ పాఠశాలలకు దాతలు చేయూత అభినందనీయమని ఆ గ్రామ సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి అన్నారు. మండలంలోని శంకరాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలకు ఆ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వజ్జా ప్రసాదరావు 20 వేల రూపాయలు విలువగల రెండు బీరువాలను పాఠశాలకు అందజేశారు. వజ్జా ప్రసాదరావును ఉపాధ్యా యులతో పాటు గ్రామస్తులు అభినందించారు. ప్రధానో పాధ్యాయురాలు ఎన్.అరుణ కుమారి మాట్లాడుతూ ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి పాఠశాలకు సామాగ్రి సమకూరుస్తే పాఠశాల అభివృద్ధికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఇజ్రాయిల్, డి.శ్రావణ్ కుమార్, వి చిరంజీవి, పి శ్రీనివాసరావు, ఏ లేవీ ప్రసాద్, కే ప్రసన్నకుమార్, జి పార్వతి, ఎన్ లీలా ఉమాదేవి, కే కోటేశ్వర కుమార్, డి.గాలిబి, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మ నిర్భర్ భారత్'లో బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-రాచర్ల : భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వము ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ(ఆత్మ నిర్భర్ భారత్) కార్య క్రమం జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏంఎల్‌సి సోము వీర్రాజు, ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమ జిల్లా ఇంచార్జి అశోక్ రాజు పాల్గొన్న ఈ కార్యక్రమం ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెవి నారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, మాజీ జిల్లా ఎస్సి మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టె మల్ల పుల్లయ్య,కొమరోలు మండల అధ్యక్షులు కె.వెంకటరామిరెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోము వీర్రాజు మాట్లాడుతూ స్వదేశీ తయారీ వస్తువులను ప్రజలు కొనుగోలు చేసి ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరిచే విధంగా ప్రతి బీజేపీ నాయకులు కార్యకర్తలు గ్రామాలలో ప్రజలకు సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించి కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ భారత్ కార్య క్రమం విజయవంతం అవడానికి కృషి చేయాలని కోరడం జరిగింది.

కార్మిక నేత అమీరుల్లా ఖాన్‌కు నివాళి

విశాలాంధ్ర-మార్కాపురం : గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా, ప్రస్తుతం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులుగా, మోటార్ వర్కర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) అధ్యక్షులుగా తుది శ్వాస వరకు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి పఠాన్ అమీరుల్లాఖాన్ అని టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం ఆయన సేవలను కొనియాడారు. స్వర్గీయ అమీరుల్లా ఖాన్ సంతాప సభ ఏఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో జిల్లా కార్యదర్శి ఎస్‌కె.కాసిం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనాల మాట్లాడుతూ అమీరుల్లా ఖాన్ తన రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మరక లేకుండా ప్రజల మధ్యన జీవించారని అన్నారు. మోటార్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అందే నాసరయ్య మాట్లాడుతూ అమీరుల్లా ఖాన్ నిరంతరం కార్మిక పక్ష పాతీగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించారని అన్నారు. సంతాప సభకు అధ్యక్షత వహించిన ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్ కె. కాసిం మాట్లాడుతూ కార్మిక నేత అమీరుల్లా ఖాన్ లేని లోటు పూడ్చలేనిదని, అయినప్పటికీ ఆయన ఆశయాల కోసం కృషి చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సంతాప సభ ప్రారంభానికి ముందు టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, ఏఐటియుసి నాయకులు అందె నాసరయ్య, రైల్వే డి ఆర్ సి సి మెంబర్ గాయం నారాయణ రెడ్డి, ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ కె జి నరసింహం మరియు నాయకులు అమీరుల్లా ఖాన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అమీరుల్లా ఖాన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల కోసం మహిళలు పడిగాపులు

విశాలాంధ్ర - రేపల్లె : ఉచిత బస్సు పథకానికి మహిళల నుండి విశేష ఆదరణ లభిస్తున్న తరుణంలో వారికి సరిపడా బస్సులు రేపల్లె డిపోలో లేకపోవడంతో గంటలకొద్దీ మహిళా ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు పడవలసి వస్తూ ఉన్నది.డిపోలో ఉన్న బస్సులకు అదనంగా ఇటీవల కొత్తగా 10 బస్సులను మహిళల కోసం ఉచితంగా ఆర్టీసీ వారు నడుపుతున్నారు.అయితే పెరిగిన మహిళ ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు డిపో యాజమాన్యం ఏర్పాటు చేయకపోవడంతో రేపల్లె-గుంటూరు-తెనాలి-విజయవాడ-చీరాల-బాపట్ల తదితర ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులు రేపల్లె డిపోలో బస్సులు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు.డిపోలో మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపిస్తూ ఉన్నది.మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఉచిత బస్సులను మరిన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల గమ్యస్థానానికి వెళ్లే విధంగా ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు. రేపల్లె డిపో నుండి ఆర్టీసీ ఉచిత సర్వీసులు మహిళల కోసం మరిన్ని ఏర్పాటు చేయాలని మహిళా ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరుతూ ఉన్నారు.

బహిరంగంగా ధూమపానం చేస్తే చర్యలు

- పట్టణ సీఐ ఆర్.రాంబాబు

విశాలాంధ్ర - బాపట్ల : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు హెచ్చరించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్,బస్టాండ్ పలు ప్రదేశాల్లో మంగళవారం బహిరంగంగా ధూమపానం చేస్తున్న పలువురుపై కేసుల నమోదు చేశారు.ఈ సందర్భంగాసీఐ మాట్లాడుతూ ధూమపానం చేయటం ఆరోగ్యానికి హానికరం అని ధూమపానం చేయటం వల్ల మీరు వదిలే పొగ పీల్చటం వలన మీతో పాటు మీ పక్కన ఉండే వ్యక్తులకు కూడా ఇబ్బంది కలుగుతుందని వారు కూడా అనారోగ్యాలు పాల్పడే అవకాశం ఉందన్నారు.జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల పట్టణంలో బహిరంగ మద్యపానం,ధూమపానం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పవన్ గోపికృష్ణకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

విశాలాంధ్ర-మార్టూరు : జీఎస్టీ సేవింగ్ అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రధాని నరేంద్ర మోడీతో ముఖాముఖికి అరుదైన అవకాశం పొందిన బొల్లాపల్లి విద్యార్థి చాతారాజుపల్లి పవన్ గోపికృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు.బొల్లాపల్లికి చెందిన పవన్ గోపికృష్ణ పంగులూరు మండలం కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలోనే అద్భుత ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.జీఎస్టీ సేవింగ్స్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో రాష్ట్రస్థాయిలో కావడం పర్చూరు నియోజకవర్గానికి గర్వకారణం అన్నారు.ఈనెల 16న గోపికృష్ణ శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం రావడం అద్భుత ప్రతిభకు నిదర్శనం అన్నారు. భవిష్య త్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-చీరాల రూరల్ : విశాఖపట్నంలో గూగుల్ డేటాసెంటర్ ఏర్పాటు ద్వారా ప్రభుత్వానికి రూ.పది వేల కోట్ల ఆదాయం రానున్నదని టీడీపీ యువనాయకులు మద్దులూరి గౌరీ అమర్ నాథ్ అన్నారు.చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీ అమర్ నాథ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు.ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీ అయిన గూగుల్ ఏఐ హబ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి భారీగా ఆర్థిక ప్రయోజనం,యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు రానున్నాయని తెలిపారు. గూగుల్ విశాఖకు రావడానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేశారన్నారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందన్నారు. ఈ సమావేశంలో ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జనార్ధన్ రావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని రైతులకు రబీ సీజన్‌లో సాగు చేసే శనగ పంటకు,శనగ విత్తనాలపై 25శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికార ఎస్.వి.పి కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఎకరానికి 40 కిలోల చొప్పున ఒక్కో రైతుకు ఐదు ఎకరాలకు శనగ విత్తనాలను అందజేయడం జరుగుతుందన్నారు.జేజి-11,కేఏకే-2 రకాలు ఇస్తున్నట్లు తెలిపారు.క్వింటా పూర్తి ధర 7800,సబ్సిడీ 1950, పోను, రైతు 5,850,చెల్లించాలని తెలిపారు.శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లో రైతు సేవ కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చెకుముకి పోటీల గోడ పత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - సంతమాగులూరు : జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో చెకుముకి (సైన్స్ సంబరాలు) నిర్వహించను న్నట్లు ఆ సంఘం సంతమాగులూరు మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మోహనాంజలి, వి.వి.శివరామకృష్ణ తెలిపారు. ఈమేరకు మక్కెనవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు ఎస్కే కాశిం సైదులు చేతులు మీదుగా గోడపత్రా లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18న పాఠశాల స్థాయి,నవంబరు 1న మండలం, నవంబరు 23న జిల్లా, డిసెంబర్ 12,13,14వ తేదీలలో రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. తెలుగు,ఇంగ్లీషు భాషలలో జరిగే ఈ పోటీలలో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా పాల్గొన వచ్చని చెప్పారు.పూర్తి వివరాల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కానీ, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. టీచర్లు చంద్రగిరి శ్రీనివాసరావు, చంటి శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

దీపావళికి శాంతిభద్రతలు కట్టుదిట్టం చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : దీపావళికి శాంతిభద్రతలుకట్టుదిట్టం చేయాలని రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి తెలిపారు. దీపావళి వేడుకలను పురస్కరించుకొని రేపల్లె ఆర్డీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశా నికి రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి, రేపల్లె ఎస్డిపిఓ ఏ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ పండుగ సమయంలో శాంతి భద్రతా పరమైన చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ, అగ్నిప్రమాదాల నివారణ వంటి అంశాలపై చర్చించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పండుగలో తాత్కాలిక లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, శాంతి భద్రతను కాపాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రేపల్లె తాసిల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్, రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జున్ రావు,రేపల్లె ఫైర్ స్టేషన్ అధికారి వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

సింగరకొండ ఆలయానికి విరాళం

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండపానికి కోగంటి బసవయ్య సుశీల దేవి జ్ఞాపకార్థం వారి మనవళ్లు శ్యామ్ సంజయ్‌లు మంగళవారం రూ.1,11,116 లక్షల విరాళాన్ని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చుండూరి మురళి సుధాకర్‌కు అందజేశారు. ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ ఏజెండ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

అద్దంకిలో భారీ వర్షం

విశాలాంధ్ర - అద్దంకి : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవాతనం కారణంగా అద్దంకి మండలంలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి.మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని పలు వీధులు జల మాయమయ్యాయి.నాగులపాడు జగనన్న కాలనీలో భారీగా వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.గుండ్లకమ్మ బ్రిడ్జి మీద గుంతలలో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుండ్లకమ్మకు భారీగా వరదనీరు చేరి నిండుకుండలా ప్రవహిస్తోంది.

ఆసుపత్రికి వాటర్ డిస్పెన్సర్ బహుకరణ

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బహుకరించిన కొత్త వాటర్ డిస్పెన్సర్‌ను మంగళవారం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోజులు మంచి నీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రోగులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే దృక్పథంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ సహకారం అందించారని కొనియాడారు.రోగులు ఈ వాటర్ డిస్పెన్సర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ స్వప్న, బీసీ సంక్షేమ సంఘం యువజన బాపట్ల జిల్లా అధ్యక్షులు పచ్చపట్ల గంగరాజు, నిజాంపట్నం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షులు నరేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యువజన నాయకులు నర్రా సునీల్, కన్నెటి శ్రీనివాసరావు, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రైతులు నూతన పరికరాలు,వాటి యొక్క ఉపయోగాలు తెలుసుకోవాలని తద్వారా పంట కోత అనంతరం తీసుకోవల సిన, ఉపయోగించే పరికరాల గురించి అవగాహన కలుగుతుందని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీ అన్నారు.మంగళవారం రైతులను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ వారి సౌజన్యంతో బాపట్లలో ఉన్న పంట కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞాన కేంద్రమునకు విజ్ఞాన యాత్రలో భాగంగా తీసుకెళ్లడం జరిగింది. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే మినీ రైస్ మిల్ అలాగే అపరాల పంటలకు ప్రాసెసింగ్ పద్ధతులు వివిధ రకాల నూనె గింజల నుంచి నూనె తయారు చేసే విధానాలను రైతులకు వివరించారు.డాక్టర్ వాసుదేవ మాట్లాడుతూ సోలార్ డ్రయ్యర్ వాటి యొక్క ఉపయోగాల గురించి వివరించారు.ముఖ్యంగా పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా రైతులు పంటకు విలువ జోడించి అది కాదాయం పొందే మార్గాల గురించి డాక్టర్ సందీప్ రాజు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బిడి రామకృష్ణ,వ్యవసాయ సహాయకులు రైతులు,బాపట్ల పోస్ట్ హార్వెస్టర్ రిసెర్చ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పూజ్య రామకృష్ణ జయంతి

విశాలాంధ్ర-వేటపాలెం : వేటపాలెం నుండి కొత్తపాలెం రోడ్డులో గల దత్త క్షేత్రంలో డాక్టర్ మారెళ్ల రామకృష్ణ గురుజీ 77వ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా క్షేత్ర కన్వీనర్ ప్రమీల దేవి మాట్లాడుతూ దత్త క్షేత్ర స్థాపనలో రామకృష్ణ గురుజి ఆధ్యాత్మిక దృష్టి,సేవా తపన కీలక పాత్ర పోషించాయని ఆయన స్ఫూర్తితో ఈ క్షేత్రం ఈ స్థాయికి ఎదిగింది అని తెలిపారు.పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రామకృష్ణ గురుజి ఉపన్యాసాలు, ఆధ్యాత్మిక బోధనలు ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని,ఆయన రచించిన పుస్తకాలను మణి,సురేఖ శ్రీదత్త ఆశీస్సులతో ఆవిష్కరించారని తెలిపారు.పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో క్షేత్ర కార్యదర్శి నున్న శివ ప్రసాదరావు, హైమవతి, సీత, రామకృష్ణ, లక్ష్మణ్ స్వామి, బండ్ల చంద్ర, పద్మావతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.అనంతరం అష్టమి వ్రతాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.కార్యక్రమం చివర్లో అన్నవితరణ నిర్వహించగా,భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు లక్ష్మీ ప్రియ ఎంపిక

విశాలాంధ్ర-వేటపాలెం : వేటపాలెం జిల్లాపరిషత్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రియ, 52 కేజీల విభాగంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని తెలిపారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఈనెల 6వ తేదీన ఒంగోలులో నిర్వహించబడ్డాయి.ఈ పోటీలలో ప్రతిభ చూపిన లక్ష్మీప్రియను ప్రాథమిక, మధ్యస్థాయి శిక్షణ ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.లక్ష్మీప్రియ ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ,శారీరక దారుఢ్యం,మానసిక ఉల్లాసం మాత్రమే కాక, ఉన్నత విద్య,ప్రభుత్వ ఉద్యోగాల కోసం రాష్ట్ర,జాతీయ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పి.ఈ.టీలు జడ దేవకిక్షం, జరుబుల శ్రావణి, కాల్వ సోమశేఖర్, ఉమ్మిటి వేణుగోపాలరావు, అత్తులూరి వెంకటసుబ్బారావు, సుజాత, సజ్జా వసుధకుమారి, ఎల్ అంజమ్మటి గురుమని, డి.ఎల్ లక్ష్మీనారాయణ, బి.వి కృష్ణమూర్తి, ఎం.బ్రహ్మానందరెడ్డి లక్ష్మీప్రియను అభినందించారు. వీరి ఆశయాలను ప్రతిబింబిస్తూ, పాఠశాల అధికారులు, కోచ్‌లు, సిబ్బంది ఆమెకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే అవకాశాలు అందాలని ఆకాంక్షించారు.

సైనికులు మృతి బాధాకరం

- రాష్ట్ర అధ్యక్షులు తాండ్రా సాంబశివరావు

విశాలాంధ్ర-బాపట్లటౌన్ : రాజస్థాన్‌లో యుద్ధవిన్యాసాలు నిర్వహిస్తూ, అను కోని దుర్ఘటనలో వీరమరణం పొంది బ్యాటిల్ క్యాజువాలిటీగా డిక్లేర్ చేయ బడిన మేజర్ తేజ్ భరద్వాజ మృతి చెందడం బాధాకరమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్రా సాంబశివరావు అన్నారు. బాపట్ల మండలం ఆసోదివారిపాలెం గ్రామానికి చెందిన సర్వింగ్ సోల్జర్ ఆసోది గోపి రెడ్డి సెలవులుపై బాపట్లకు వచ్చి దురదృష్టవశాత్తు సెప్టెంబర్ 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారని వారికి మాజీ సైనిక సంక్షేమ తరపున ప్రగాఢ సంతాపం తెలిపారు. గోపి రెడ్డి పార్థీవ దేహం కూడా బుధవారం ఉదయానికి తన స్వగ్రామమైన ఆసోదివారిపాలెంకు చేరుకుంటుందన్నారు. బాపట్ల పరిసర ప్రాంతాలలోని మాజీ సైనికులు గోపిరెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పించి అంతిమ యాత్రలో కూడా పాల్గొనాలని కోరారు.

బాణాసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-చెరుకుపల్లి : బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వ నిబంధన లను తప్పనిసరిగా పాటించాలని ఆర్డీవో రామ లక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక బాణాసంచా దుకాణాలను తనిఖీ నిర్వహించి వారికి తగుసూచనలు చేశారు. లైసెన్సు కలిగిన వ్యక్తులకు మాత్రమే టపాసులను అమ్మాలి అన్నారు. అదేవిధంగా స్టాల్స్ ఏర్పాటు చేసేవారు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం విధించిన ముందస్తు చర్యలను చేపట్టాల న్నారు. స్థానిక పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సూచనలను తీసుకొని వారి ఆదేశానుసారం దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు.అంతేకాకుండా అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేయడం అమ్మటం చట్టరీత్యా నేరమని అలాంటి వారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు.తొలుత గోవాడ మార్గంలో ఉన్న రవితేజ ఫైర్ వర్క్స్ దుకాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆరుంభాక మార్గంలో ఉన్న లలితాంబిక ఫైర్ వర్క్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు.డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తాసిల్దార్ సిహెచ్ పద్మావతి, ఎస్సై టి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ

విశాలాంధ్ర-పర్చూరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరు లోని బి.ఎ.ఆర్ అండ్ టి.ఎ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శేషు కుమారి,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి ఎం.మాధవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలపరిమితి మూడు నెలలు ఉంటుందని 18 నుంచి 35 సంవత్సరాలు లోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అక్టోబర్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యా అర్హతలు ఉన్నవారు అర్హులని,శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తారు అని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పి.వినోద్ కుమార్ తెలియజేశారు. ఇతర వివరములు కొరకు 6302764962ను సంప్రదించవలసిందిగా కోరారు.

సీపీఆర్ చేయడంతో ప్రాణాలకు రక్షణ

విశాలాంధ్ర-నిజాంపట్నం: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు. మంగళవారం నిజాంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా జడ్పీ టీసీ నర్రా సుబ్బయ్య హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమన్నారు. తద్వారా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాన్ని రక్షించే మార్గాలను నేర్చుకోవచ్చని చెప్పారు.సీపీఆర్‌పై ప్రజలు అవగాహన పెంచుకొని తమ సొంత భద్రతకు అలాగే సమాజ సేవకు తోడ్పడాలని ప్రోత్సహించారు.డాక్టర్ స్వప్న మాట్లాడుతూ ప్రజలు సీపీఆర్ చేసే పద్ధతుల గురించి తెలుసుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడం సులభమవుతుందన్నారు.ప్రతి ఒక్కరికి సీపీఆర్ చేసే పద్ధతులు తెలిసినట్లయితే, ప్రమాదకర పరిస్థితుల్లో సమయానికి సరైన చర్యలు తీసుకోవచ్చని చెప్పారు.పీఎం నరేంద్ర మోదీ,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం ఈ నెల 13 నుండి 17 వరకు ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సీపీఆర్ చేసే విధానం, ప్రాథమిక వైద్య సహాయం,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు.బీసీ సంక్షేమ సంఘం యువజన బాపట్ల జిల్లా అధ్యక్షులు పచ్చపట్ల గంగరాజు, పీఏసీఎస్ అధ్యక్షులు నరేష్ యాదవ్,ఆసుపత్రి వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి రాజకీయ చైతన్యం ఉండాలి

విశాలాంధ్ర-చీరాల: విద్యార్థి దశ నుండి రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని,ప్రతి ఒక్కరు తమ ప్రాంతంలో సమస్యలపై అవగాహన కలిగి ఉండి,ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకొని ముందుకు వెళ్లాలని బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉండవల్లి శ్రీనివాస్ రావు,బిసి వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు ద్రాక్షారపు సూరి బాబు యువతకు పిలుపునిచ్చారు.చీరాలలోని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ హాల్‌లో చీరాల ప్రజాసంఘాల సహకార ంతో రాజకీయ శిక్షణ తరగ తులలో భాగంగా బహుజన పాత్ర -సామాజిక బాధ్యత -రాజకీయ ప్రాధాన్యత అనే అంశాలపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుండి వచ్చిన ఉండవల్లి శ్రీనివాసరావు, విజయవాడ నుండి వచ్చిన ద్రాక్షారపు సూరిబాబు అధ్యక్షత వహించారు. శిక్షణా తరగతులకు కో-ఆర్డినేటర్‌గా కాకినాడ నుండి వచ్చిన బిసి వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు సత్యకృష్ణ,రిఫార్మ్స్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు విజయ్ బాధ్యతలు నిర్వహించారు.సభ అధ్యక్షులుగా ఉటుకూరి వెంకటేశ్వర్లు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాదె హరిప్రసాదరావు, మార్కాపురం వెంకట రామా రావు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు,చీరాల బిజెపి నాయకులు తాడివలస దేవరాజు, చైతన్య మనోవికాస చైర్మన్ వెంకన్న బాబు, జన జాగృతి సభ్యులు రాధాకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతపై గజఈతగాళ్లకు సూచనలు

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : సూర్యలంక సముద్ర తీరం వద్ద పర్యాటకుల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గజ ఈతగాళ్లకు బాపట్ల తహసీల్దార్ షలీమా, ఎంపీడీవో బాబురావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం మైకులలో లోతుకు వెళ్లొద్దంటూ సూచనలు చేయడంతో పాటు నడుము లోతుకు మించి పర్యాటకులను లోపలకు పంపించకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.రేపల్లెపాటులో జరిగే ప్రమాదాలను నియంత్రించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పర్యాటకుల పర్యవేక్షణ పద్ధతుపై ప్రత్యేక చొరవ తీసుకుంటు న్నట్లు వివరించారు.సముద్ర తీరంలో ఏ ఒక్క ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని పోలీసులు గజఈతగాళ్లు పర్యవేక్షణ చేయాలన్నారు. మైకులలో ప్రమాదాలపై అప్రమత్తత చేస్తూ పర్యటకుల భద్రత ధ్యేయంగా పనిచేయాలని సూచనలు చేశారు.

ఉపకార వేతనానికి విద్యార్థులు కృషి చేయాలి



విశాలాంధ్ర-కర్లపాలెం : జాతీయ ప్రతిభ ఉపకార వేతనం పొందాటానికి విద్యార్థులు కృషి చేయాలని కర్లపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.విజయశ్రీ అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో చదువుకొనుచు జాతీయ ప్రతిభ ఉపకార వేతన పోటీ పరీక్షకు సిద్ధపడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు.మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు సహకారంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం సమక్షంలో కర్లపాలెం మండలంలో అన్ని ఉన్నత పాఠశాలలకు అందించారు. మండల యుటిఎఫ్ నాయకులు ఇన కొల్లు పోలీస్‌రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యా దేశాభివృద్ధికి పునాది వంటిదని అటువంటి విద్యను విద్యార్థులు ఆసక్తితో చదవాలని ఎక్కువమంది ఉపకార వేతనం పొందటానికి ప్రయత్నం చేయాలని సూచించారు.స్థానిక ప్రైమరీ మోడల్ స్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, బి.రాజేష్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్,రాజేష్ ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నామ మాత్రంగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర- కొల్లూరు : మండల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు చేపట్టిన పనుల గురించి చర్చలు లేకుండా కొల్లూరు మండలపరిషత్తు సమావేశం నామమాత్రంగా జరిగింది. మంగళవారం ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షతో తూతూ మంత్రంగా ముగించారు. సభ్యులు పలు సమస్యలపై ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానాలు వెలువడకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా అధికారులు, సిబ్బంది ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు మండలపరిధిలోని పలు గ్రామాలలో రహదారుల వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందని మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. సభ్యుల సమస్యపై సమాధానం ఇచ్చేందుకు ఆర్ అండ్ బీ శాఖ అధికారి అందుబాటు లో లేకపోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ శాఖల సిబ్బంది పనితీరు మెరుగుపడాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీఓ కె. నరశింహారావు పాల్గొన్నారు.

నేడు బాపట్లలో అబ్దుల్ కలాం జయంతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు బాపట్ల పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద గల అబ్దుల్ కలాం విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం ఏర్పాటు చేశామని అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ అన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, అబ్దుల్ కలాం అభిమానులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

- వానాకాలం నేపథ్యంలో తాగునీరు కలుషితం
- ప్రజా ఆరోగ్యంతో చెలగాటం తగదు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-బల్లికురవ: స్థానిక బల్లికురవ మండల పరిధిలోని అంబడపూడి గ్రామంలో తాగునీరు చెరువువద్ద స్టోరేజ్ ట్యాంకులను శుద్ధి చేయకపోవ డంతో నీరు పచ్చరంగుగా మారి దుర్వాసన వస్తున్నాయి. ప్రతిరోజు గ్రామానికి ఉదయాన్నే కులాయి ద్వారా సరఫరా అయ్యే నీరు పైపులైన్ల లీకేజీల కారణ ంగా కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి.పాచి మట్టి రంగు నీరు తాగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.ఈ సమస్యను గ్రామ సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని అంబడిపూడి గ్రామ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం చాలా బాధ కరమని తక్షణమే గ్రామ మండల అధికారులు జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అంబడిపూడి గ్రామ ప్రజానీకం కోరుతున్నారు.లీకేజీ పైప్ లైన్లు రిపేర్‌చేయాలని, పరిష్కారానికి చర్యలుచూపి ప్రజాఆరోగ్యం కాపాడాలని గ్రామప్రజలు కోరారు.

బాలికలకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-అద్దంకి:మండలంలోని చక్రాయ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలిక దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ కొరిశపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోరబాలికలకు బాల్యవివాహ వల్ల కలిగే నష్టాలు,బాలికల హక్కులు,గుడ్ టచ్ బాడ్ టచ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన బాలికలకు మంగళవారం ఎంఈఓ శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు విషయలక్ష్మి, అచ్చమ్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలి

– రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పెద్దారవీడు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ పెద్దారవీడు మండలం లోని హనుమాన్ జంక్షన్ కుంట సెంటర్‌లో పెద్దార వీడు రైతు సంఘం నాయ కులు గోపి దేశి మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథు లుగా హాజరై జిల్లా అధ్యక్షులు జయంతి బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులపై వారు పండించిన ఉత్పత్తుల కొనుగోలుపై, మార్కెట్ నిర్వహణలో ఒక తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నా రని, ప్రైవేటు వ్యాపారుల దయా, దాక్షిణ్యాలకు రైతుపండించిన ఉత్పత్తులను వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా పత్తి మిరప పొగాకు సెనగలు కంది మినుములు మొదలగు ఉత్పత్తులకు గిట్టు బాటు ధరలు లభించక రైతులు తీవ్రమైన అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఈ సంవత్సరం పత్తి పంటను పశ్చిమ ప్రకాశం జిల్లా అంతట ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విరివిగా పత్తి పంటను రైతులు పండించారన్నారు. ప్రభుత్వం

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక పోవడం వల్ల పత్తి బయ్యర్లు గ్రామాలలో అతి చౌకగా కొను గోలు చేయడం జరుగుతుందని ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభు త్వం క్వింటా ధర రూ. 8110లు ప్రకటించిం దని ఒక క్వింటానేటికీ కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మార్కాపురం కేంద్రంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభి ంచాలని డిమాండ్ చేశారు. ఈ మహా సభలో హనుమాన్ జంక్షన్‌ను రానున్న కాలంలో చుట్టుపక్క గ్రామా లను కలిపి హనుమాన్ జంక్షన్‌ను మండల కేంద్రంగా ప్రకటిం చాలని, హనుమాన్ జంక్షన్ కుంట సెంటర్లో ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణం లేకపోవడం వల్ల ప్రయా ణికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. అనంతరం రైతు సంఘం పెద్దారవీడు మండల కమి టీని ఎన్నుకోవడం జరిగింది. మండల కన్వీనర్‌గా దొడ్డ సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులుగా సొంటి రాధాకృష్ణా రెడ్డి, కంచర్ల రామాంజనేయులు, వెన్నా పెద్ద వెంకటే శ్వర్ రెడ్డి, సొంటి వెంకటరెడ్డి, కుర్ర వెంకటేశ్వర్లు, గాలి రామిరెడ్డి, దేవి రెడ్డి వెంకటేశ్వ ర రెడ్డి, నరాల వెంకటేశ్వర్లు, గోపిదేశి మల్లయ్య, దుగ్గెం పూడి కాశిరెడ్డి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య రైతు సంఘం సీనియర్ నాయకులు గాలి వెంకట్రా మిరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి దుగ్గెంపూడి తిరుప తిరెడ్డి, మార్కాపురం మండలం రైతు సంఘం నాయకులు గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మహాసభలోమాటాడారు.

కోటి సంతకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వైసీపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వెన్నా పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ వైసీపీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 14వ తేదీ నుండి జరుగు సంతకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనుమా రెడ్డి పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్యకళా శాలలను ప్రైవేటు పరం చేయడం అంటే సామాన్య ప్రజలకు వైద్య విద్యను దూరం చేయడమేనని ఆయన విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా వైద్య విద్యను సామాన్య విద్యార్థు లకు ఉచితంగా అందించాలన్న సామాజిక దృక్పథంతో గతంలో ఎన్నడు లేని విధంగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను మన రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. నిర్మాణ దశ చివరిలో ఉన్న మెడికల్ కళాశా లను పూర్తిచేసి వినియోగం లోకి తీసుకు రావలసిన ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజా గ్రహాన్ని చవి చూడక ముందే మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేనిచో తమ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి పాలక వర్గాన్ని హెచ్చరించారు.

పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం

విశాలాంధ్ర-మార్కాపురం : రైతుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. తర్లుపాడు మండల పిఎసిఎస్ సింగి ల్విండో చైర్మన్ వెలుగు క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కాశీనాథ్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో భాగమైన తర్లుపాడు మండలంలోని రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వివిధ పంటలకు రుణాలను అందించాలని నూతన చైర్మన్‌కు సూచిం చారు. నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వెలుగు క్రాంతి కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం పార్టీ ఇన్చార్జి ఉమ్మడి కాశీనాథుల సలహాలు సూచనలతో ముందుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, టిడిపి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులు కోసం రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు పడిగాపులు

విశాలాంధ్ర-పామూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు కోసం రేషన్ షాపులు వద్ద లబ్ధిదారులు మంగళ వారం పడిగాపులు కాశారు. సోమ వారం ప్రతి గ్రామంలో అధికార పార్టీ నాయకులు చేత కొద్దిమందికి పంపిణీ చేయించి రేషన్ షాపులకు అప్పగించారు. స్మార్ట్ కార్డులు కోసం రేషన్ షాపుల వద్దకు లబ్ధిదారులు క్యూ కట్టారు. కార్డులన్నీ కలిసి ఉండటంతో వాటిని వెతికి తీసుకొనుటకు గుంపులుగా లబ్ధిదారులు చేరి వెతికిలాడుకుంటున్నారు.

నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేయాలి

విశాలాంధ్ర - గిద్దలూరు : నకిలీ మద్యం పై సీబీఐ దర్యాప్తు చేయాలని వైఎస్ ఆర్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నకిలీ మద్యంపై నిర సన కార్యక్రమాన్ని నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని అంద జేశారు. గిద్దలూరు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మానం బాలిరెడ్డి, బత్తేం ఓబుల రావు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పై ఏదో ఒక సాకు చూపించి మరక చేయా లని ప్రచారాన్ని నిర్వహించడం పరిపాటి అయిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రజల నుండి వస్తున్న ఆదరణ ను సహించలేక నిత్యం ఏదో ఒక ఆరోపణలు చేస్తూనే ఉన్నారని ప్రజల పాలన పక్కనపెట్టి ప్రతిపక్షం పై విమర్శలే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు నారావారి సారవద్దు కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీయొద్దు అంటూ నినాదాలు చేసుకుంటూ ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. వైసీపీ అనుబంధం సంఘాల రాష్ట్ర నాయకులు సుర స్వామి రంగారెడ్డి చే రెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

జీఎస్టీ తగ్గింపుతో మేలు



విశాలాంధ్ర-తాళ్లూరు : జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు జరిగే ఉపయో గాన్ని ప్రజలకు తెలపాలని ఏసీటీఓ సుధాకర్ రావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో జీఎస్టీ తగ్గింపు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు మెరుగైన సేవింగ్స్ జరుగుతాయని అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌తో ప్రతి ఇంటికి తక్కువ ధరల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు అందించటం, ఎంఎస్ఎంఈలు, స్థానిక తయారీదారు లకు, డీలర్లకు ప్రోత్సాహం ఇవ్వటం, 2వ, 3వ స్థాయి నగరాలలో డిమాండ్ పెంచటం, డిజిటల్ ఆంధ్ర ప్రదేశ్ దిశగా ముందుకు సాగటం, ఈ సంస్కర ణల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ఎంపీడీవో అజిత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచులు వలి, శ్రీదేవి రామయ్య, టిడిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు , తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సనాతన పాలనలో దళిత జడ్జీలు, ఐఏఎస్, ఐపీఎస్ లకూ భద్రత లేదు

- దళిత ఐపీఎస్‌ను బలిగొన్న మనువాదం
- పూరన్ కుమార్‌ను కాల్చుకు తిన్న హర్యానా డీజీపీ, ఎస్పీలను అరెస్టు చేయాలి
- న్యాయం కోసం పూరన్ భార్య ఐఏఎస్ అధికారిణి అమనీత్ పోరాటం దళితులకు స్ఫూర్తి
- కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలో దళిత నేత నీలం

విశాలాంధ్ర-ఒంగోలు : బీజేపీ సనాతన పాలనలో దళిత జడ్జీలు, ఐఏఎస్, ఐపీ ఎస్ లకూ భద్రత లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వ ర్యంలో హర్యానా అడిషనల్ డీజీపీ పూరన్ కుమార్ బలవన్మరణానికి నిరసనగా, పూరన్ భార్య ఐఏఎస్ అధికారిణి అమనీత్ న్యాయ పోరాటానికి మద్దతుగా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్ర మాట్లాడుతూ, చిత్తూరు జిల్లా దళితుడైన వై పూరన్ కుమార్ 2001 బ్యాచ్ హర్యానా కేడర్ ఐపీఎస్‌గా ఎపికయ్యారన్నారు. విధి నిర్వహ ణలో సమర్థతతో పాటు నిజాయితీ కలిగిన అధికారిగా పూరన్ కుమార్‌కు రాష్ట్రపతి ఉత్తమ్ సేవా పతకం కూడా ఇచ్చార న్నారు. పోలీసుశాఖలో కుల వివక్షత్తో పాటు అనేక అక్రమాలకు వ్యతిరేకంగా పూరన్ కుమార్ గళమెత్తి పోరాడాడన్నారు. దీంతో పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పూరన్ కుమార్ పై పగబట్టి వేధించారన్నారు. చివరకు ఓ లంచం కేసులో ఇరికించడంతో, పూరన్ కుమార్ మనస్తాపానికి గురై, 8పేజీల సూసైడ్ నోట్ రాసి, సర్వీసు రివాల్వర్ తో కాల్చుకుని చనిపోయాడన్నారు. తన కెరీయర్‌ను నాశనం చేయడానికి పన్నిన కుట్రల్ని ప్రస్తావించారన్నారు. పూరన్ భార్య అమనీత్ 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అన్నారు. అమనీత్ ఫిర్యాదు మేరకు హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్ర బిజార్నియా తదితరులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. అమనీత్ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శ నలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. బిజెపి డౌన్ డౌన్, మోడీ డౌన్ డౌన్, హర్యానా డీజీపీ ఎస్పీలను అరెస్టు చెయ్యాలని దళితులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పోటికలపూడి జజయరాం, దళిత నాయకులు కాకుమాను రవి, పిల్లి మాల్యాద్రి, మిట్నసల శాంత, కసుకుర్తి రాజు పాల్గొన్నారు.

సచివాలయాలు తనిఖీ

విశాలాంధ్ర-కొమరోలు : గ్రామ పంచాయతీ లోని 1,2& 3 సచివాల యం లను మండల పరి షత్ అభివృద్ధి అధికారి మరియు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజిట్ చేశారు. సదరు సచివాలయ సిబ్బందితో సంక్షేమ పథకాలు, ఇతర సచివాల య సిబ్బంది చేయవలసిన పనుల గురించి చర్చించారు. సదరు సచివాలయ సిబ్బంది అందరికీ సలహాలు సూచనలు ఇచ్చారు.

పరీక్షలు నిర్వహించి మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలి : ఎంఈఓ

విశాలాంధ్ర-సిఎస్‌పురం : ఎఫ్.ఎ-2 (ఫార్మాటివ్ అసెస్‌మెంట్-2) పరీక్ష లను కట్టుదిట్టంగా నిర్వహించి మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి సూచించారు. మంగళవారం దర్శి గుంటపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠ శాలలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు పూర్తి అయిన వెంటనే జవాబుపత్రాలు దిద్ది మార్కులను ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. మండలం లోని విద్యార్థులకు అవసరమైన 2వ సెమిస్టర్ పుస్తకాలు అన్ని పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయడం విద్య అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించా లని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు సూచించారు. మండల లోని అన్ని పాఠశాలల్లో బుధవారం (గ్లోబల్ హ్యాండ్ వాష్ డే) అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఆచరించాలని ప్రధానోపాధ్యాయులకు సూచి ంచారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య సూత్రాలు పాటిం చడం, పరిసరాలు పరిశుభ్రత వంటి అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు షేక్ రసూల్, సిఆర్పి సతీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ని పరామర్శించిన వెన్న శివకృష్ణారెడ్డి

విశాలాంధ్ర-పెద్దారవీడు: హైదరాబాదులోని మాజీ ఆది మూలపు సురేష్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రకా శం జిల్లా వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు వెన్న శివ కృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, కొండెపి నియోజకవర్గ సోషల్ మీడియా పని తీరుపై చర్చించి మునుముందు నియో జకవర్గంలో సోషల్ మీడియాతో పార్టీ కార్యక్రమాల గురించి చర్చించడం జరిగిందన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com బుధవారం 15 । అక్టోబరు । 2025

తీరంలో భద్రతా చర్యలు మరింత పటిష్టం

– జిల్లా ఎస్పీ బి.ఉమామేశ్వర్

విశాలాంధ్ర–బాపట్ల : తీరంలో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేస్తామని జిల్లా ఎస్పీ బి.ఉమా మేశ్వర్ తెలిపారు. కూచిన షారోన్ రాజు మృత దేహాన్ని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామ పరిధి లోని సముద్రతీరంలో మంగళవారం మధ్యాహ్నం పోలీస్ అధికారులు గుర్తించారని జిల్లా ఎస్పీ తెలిపారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో శవపంచనామా అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సముద్రతీరాలకు విహార యాత్రకు వచ్చే యాత్రికులు పోలీస్ శాఖ సూచ నలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సూచిం చిన ప్రదేశాలలోనే సముద్రంలో స్నానాలు ఆచరించాలని తెలిపారు. సముద్రతీరంలో ఈతలు వెయ్యడం, మద్యం సేవించి సముద్రంలోకి దిగడం ప్రమాదకరం కనుక వాటిని నిషేధించడం జరిగిందన్నారు. మైకుల్లో పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ ఉంటారని,కానీ కొందరు యువకులు వారి హెచ్చరికలను పెడచెవిన పెట్టి సముద్ర లో సరదాగా ఆడుకుంటూ లోతుకు వెళుతుంటారన్నారు. అటువంటి సమయంలో రాకాసి అలలు వచ్చినప్పుడు యువకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సముద్ర తీరంలో పోలీస్, మెరైన్, గజఈతగాళ్లతో పాటు డ్రోన్లతో నిఘాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ గత ఆదివారం జరిగిన విషాదఘటన మరెప్పుడూ చోటు చేసుకో కుండా ఉండేందుకు భద్రతాపరమైన చర్యలను మరింత పటిష్టం చేయడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరూ పోలీస్‌శాఖ సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్ర తీరాలలో ఈతలు వెయ్యడం, మద్యం సేవించి సముద్రంలో దిగే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.పోలీస్ శాఖ హెచ్చరికలను పెడచెవిన పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని ఎస్పీ హెచ్చరించారు.గల్లంతైన యువకుల ఆచూకీ గుర్తించేందుకు సుమారు రెండు రోజుల పాటు నిర్విరామంగా కృషి చేసిన పోలీస్,ఫైర్,మెరైన్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు,సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

విశాఖలో టెక్ విప్లవానికి నాంది

విశాలాంధ్ర–మార్టూరు : ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి ఇది ఒక కొత్త యుగం ఆరంభమని,విశాఖకు గూగుల్ రావడం ఏపీలో గేమ్ ఛేంజర్ కాబోతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ఒక ప్రకటన విడుదల చేశారు.గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం ప్రారంభమవుతోందన్నారు. కేవలం ఒక పెట్టుబడి కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దిశను మార్చే చారిత్రాత్మక పరిణామం అని అన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చిన తర్వాత అక్కడికి అనేక ఐటీ కంపెనీలు క్యూకట్టాయని, ఐటీ కంపెనీల రాకతో హైదరాబాద్ స్వరూపమే మారిపోయిందన్నారు. గూగుల్ రాకతో ఏపీలో ఐటి రంగం విస్తరించబోతోందని పేర్కొన్నారు. రూ. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో సౌత్ ఆసియా లోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ను నిర్మించబోతోందని తెలిపారు. 1.88 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయమని, ఏపీభవిష్యత్ దిశను మార్చే చారిత్రాత్మక ఒప్పందం అన్నారు.

ప్రైవేట్ బ్యాంకులను ప్రభుత్వ బ్యాంకులలో విలీనం చేయాలి

విశాలాంధ్ర–చీరాల రూరల్ : ప్రైవేటు బ్యాంకులను ప్రభుత్వ రంగ బ్యాంకులలో విలీనం చేయాలని కోరుతూ చీరాల లోని కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకులను ప్రభుత్వ రంగంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ రంగంలో ఖాళీలను భర్తీ చెయ్యాలని కోరారు.పేస్కేల్ ఖచ్చితంగా అమలు చేయాలని బ్యాంక్ ఉద్యోగులు అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఏఐటియుసి బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులకు మద్దతుగా ఏఐటీయూసీ నిలుస్తుందన్నారు.ఉద్యోగుల డిమాండ్స్ నెరవేర్చకపోతే కార్మిక సంఘాలు అన్నీ కలసి దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మయ్య, మల్లెల దాసు, శ్రీనివాసరావు, వీణ, రోశమ్మ, శ్రీమాధవి పాల్గొన్నారు.

గూగుల్ రాకతో యువతకు ఉపాధి

విశాలాంధ్ర–బాపట్ల : గూగుల్ రాకతో యువతకు ఉపాధి అని ఎమ్మెల్యే వేగేశనరేంద్రవర్మ అన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఒకవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మరో వైపు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. 12 నెలలు పాటు శ్రమించి నేషనల్ పాలసీల్లో కూడా మార్పులు చేయించి 2 లక్షల మందికి ఉపాధి కల్పించి రూ.1.33 పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల ఎఫ్ఐను సాధించడం ఇదే తొలిసారి అని తెలిపారు. హైదరాబాద్లో మైక్రోసాఫ్ట్ రావడంతో టెక్ అభివృద్ధికి ఎలా గేమ్ చేంజర్ అయిందో,అలా ఇప్పుడు గూగుల్ విశాఖకు రావడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అభివృద్ధికి గేమ్ చేంజర్ మారనుందన్నారు.అభివృద్ధి వికేంద్రీకరణను మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ప్రపంచం మొత్తం నేడు సిటీ ఆఫ్ డెస్టినీ వైపే చూస్తుందని,గూగుల్ క్లౌడ్ సంస్థ నేడు మన ప్రభుత్వం ఒప్పందం శుభపరిణామం అన్నారు. ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతిపెద్ద,దేశంలోనే తొలి ఏఐ హబ్‌ను గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలు మెరుగుపడతాయని తెలిపారు. వివిధ దేశాలకు నేరుగా కంప్యూటర్ డేటా పంపేందుకు,బ్రాడ్ బ్యాండ్ వేగాన్ని పెంచేందుకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుందన్నారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి వస్తే దేశవ్యాప్తంగా అందరూ ప్రశంసిస్తుంటే వైసీపీ నేతలు స్వాగతించకుండా గూగుల్ క్లౌడ్ సంస్థకు భూములు ఇవ్వకుండా అడ్డుపడి ఆ సంస్థపై కూడా తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు చేయడం దుర్మార్గమన్నారు.

ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా చర్యలు

– కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర–బాపట్ల : ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమల య్యేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. డిఎంఎఫ్(ఖనిజ సంపద నిధి) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఖనిజ సంపద కింద చిన్న,పెద్ద గ్రానైట్ క్వారీలు,ఇసుక క్వారీల నుంచి చట్టబద్ధంగా సీనరేజ్ ద్వారా ఖనిజ సంపద నిధి సేకరించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.51.22 కోట్ల నిధి ఉందన్నారు.మార్చి నాటికి మరో రూ.నాలుగు కోట్లు సీనరేజ్ వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాకు వచ్చే ఖనిజ సంపద నిధిని జిల్లా అభివృద్ధికి వినియోగించాలన్నారు. ప్రస్తుతం రూ.48.68 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.42 పనులు చేయడానికి అధికారికంగా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. పనులు వివిధ దశలో ఉండగా వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. డిఎంఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నవంబర్ 15వ తేదీలోగా వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ మైన్స్ డిడి రామచంద్ర, కమిటీలోని సభ్యులైన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో చీకట్లో జగనన్న కాలనీ

విశాలాంధ్ర–కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో జగనన్న కాలనీ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత ప్రభు త్వం కాలంలో లబ్దిదారులకు స్థలాలు కేటా యించిన ప్పటికీ గృహనిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగ లేదు. ఫలితంగా పలు కుటుంబాలు పూరిగుడిసెలు, ప్లాస్టిక్ పరదాలు వేసుకొని తాత్కాలిక నివాసాల్లో కష్టసాధ్య మైన జీవనం గడుపుతున్నారు.ఇళ్ల నిర్మాణం పూర్తికాక పోవడమే కాకుండా కాలనీలో అత్యవసరమైన విద్యుత్ సదుపాయం లేకపో వడం ప్రజలకు తీవ్ర భయాందోళనలను కలిగిస్తోంది. సాయంత్రం వేళ అంధకారం చెలరేగిపోతుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు బయటకు రావటానికే భయపడుతున్నారు. చుట్టుపక్కల చీకటిలో విషసర్పాలు, కీటకాలు తిరుగుతుండటంతో ప్రజలు రాత్రివేళలు నిద్రపట్టకుండా గడుపుతున్నారు. రోజంతా వేడి, రాత్రికి చీకటితో పిల్లలు భయంతో ఏడుస్తున్నారు. విద్యుత్ లేక జీవితం గడపడం చాలా కష్టంగా మారింది. ప్రభుత్వం స్థలం ఇచ్చింది కాని జీవించడానికి కనీస సౌకర్యాలు లేవు" అంటూ కొందరు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.జగనన్న కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం భూక్షేత్రం కేటాయించిన వెంటనే విద్యుత్, తాగునీరు, రహదారి, డ్రైనేజ్ వంటి మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా పేర్కొంది. గృహనిర్మాణ పనులు ప్రారంభించక ముందు ఈ సదుపాయాలు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అలాగే లబ్దిదారులు తాత్కాలిక నివాసాల్లో ఉంటే విద్యుత్ లేకుండా ఉండకూడదని, తాత్కాలిక కనెక్షన్లు లేదా లైటింగ్ ఏర్పాటు చేయాలని కూడా హౌసింగ్, విద్యుత్,పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంగా పనిచేయాలని రూల్‌బుక్‌లో పేర్కొనబడింది.అయితే ఈ కాలనీలో ఆ నిబంధనలు అమలు కాలేదు. గ్రామ ప్రజలు విద్యుత్ సరఫరా తక్షణమే ఏర్పాటు చేసి, అనంతరం గృహనిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పథకంలో చేరిన లబ్దిదారులు ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నరకయాతన అనుభవిస్తున్నారు. కనీసం విద్యుత్ సదుపాయం కల్పించండి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమన్వయంతో పనిచేసి బాపట్ల జిల్లా పురోగతిని వృద్ధి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర–బాపట్ల: అధికారులందరూ సమన్వయ ంతో పనిచేసి బాపట్ల జిల్లా పురోగతిని వృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు.మంగళవారం,స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పంచాయితీ, మున్సిపాలిటీ విభాగాల పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీలలో తడి చెత్త పొడి చెత్త సేకరణలో ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా,వారానికి కనీసం రెండు రోజులు మీ ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా అనే అంశాలపై ప్రజా భిప్రాయ సేకరణలో వెనుకబడి ఉన్న పది పంచాయతీలకు కాషన్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారిని ఆదేశించారు.గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆరా తీశారు.స్వామిత్వ కార్యక్రమంలో బాపట్ల మండలం గ్రౌండ్ ట్రాతింగ్‌లో వెనుకబడి ఉందని ఆయన తెలిపారు. దీనిని 100శాతం పూర్తి చేయాలని,వెట్రోజేషన్‌ను రోజుకు 1000 చేయాలని లక్ష్యంగా నిర్దేశించి ఆ పనులపై దృష్టి పెట్టాలని ఆయన ఎంపీడీవోలకు సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ అనంతరాజు, పిడి హౌసింగ్ వెంకటేశ్వరరావు, వీక్షణ సమావేశం ద్వారా అన్ని మండల ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, మండల గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఈపురుపాలెం సీమౌత్ కొలతలు పూర్తయ్యాయి

విశాలాంధ్ర–చీరాల : ఈపురుపాలెం కరకట్ట సీమౌత్‌కు సంబంధించి కొలతల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు.సోమవారం మండల సర్వే అధికారులు సీమౌత్ ప్రాంతానికి చేరుకొని కొలతలు చేపట్టే ప్రయత్నం చేశారు.అయితే,ఆ సమయంలో కొంతమంది మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో,సర్వే ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.దీనిపై జిల్లా అధికారులు చురుకుగా స్పందించి మంగళవారం బాపట్ల ఆర్డీవో,ఎమ్మార్వో,పోలీస్ అధికారులు, మండల సర్వే అధికారులు సంబంధిత విభాగాల సిబ్బంది సమన్వయంతో సీమౌత్ వద్దకు చేరుకున్నారు.అధికారులు పరిస్థితిని సమీక్షించి,మత్స్యకారుల సహకారంతో కొలతలను సక్రమంగా నిర్వహించారు. కొలతల ప్రక్రియలో భాగంగా సీమౌత్ పరిసర ప్రాంతాల హద్దులను కూడా నిర్ధారించారు.కొలతలు పూర్తయిన అనంతరం ఆ వివరాలను అధికారుల బృందం నమోదు చేసింది.ఈ సందర్భంగా బాపట్ల ఆర్డీవో మాట్లాడుతూ మత్స్యకారులు మాకు పూర్తి సహకారం అందించారని, సీమౌత్‌కు సంబంధించిన కొలతలు హద్దులను సక్రమంగా నిర్ణయించామని,ఈ వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.ఆయన పరిశీలన అనంతరం తగిన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు.జిల్లా అధికారులు సీమౌత్‌పై పూర్తి నివేదికను సిద్ధం చేసి కలెక్టర్ నివేదిక అందిస్తామని తెలిపారు.ఈ ప్రక్రియ పూర్తయ్యాక,భవిష్యత్‌లో సీమౌత్ అభివృద్ధి,నిర్వహణకు సంబంధించిన చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.